భారత్... విపత్తుల నిర్వహణ!

ప్రత్యేకమైన భౌగోళిక వాతావరణ పరిస్థితులవల్లనే.. భారత ఉపఖండం ప్రకృతి వైపరీత్యాల బారిన పడుతోందనేది నిపుణుల విశ్లేషణ. అందువల్లే ఈ ప్రాంతం కరవు కాటకాలు, తుపానులు, వరదలు, కొండచరియలు విరిగిపడటం, భూకంపాలు వంటి వైపరీత్యాలకు తరచూ గురవుతోంది. భారత దేశంలో 54 శాతం భూభాగానికి భూకంప ప్రమాదం పొంచి ఉంది. 40 మిలియన్ హెక్టార్లు వరదలకు.. 8 వేల కిలోమీటర్ల సముద్ర తీరం తుపానుల తాకిడికి అల్లకల్లోలమయ్యే పరిస్థితి ఉండగా... 68 శాతం భౌగోళిక పాంతం కరవుతో అల్లాడే ప్రమాదముంది!!

2005 జూలై, ఆగస్టుల్లో దేశాన్ని అతివృష్టి అల్లాడించింది. ముంబయిలో గత 95 సంవత్సరాల్లో ఎన్నడూ కురవనంత వర్షపాతం నమోదయింది. దాంతో అక్కడ అన్ని అత్యవసర సేవలు ఒక్కసారిగా నిలిచిపోయాయి. ఎడతెగని భారీ వర్షాల వల్ల పెల్లుబికిన నీటిని డ్రైనేజీ వ్యవస్థ తట్టుకోలేకపోవడంతో... మొత్తం నగరమంతా నీటితో మునిగిపోయింది. అలాగే దేశ దక్షిణ ప్రాంతంలోని ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో కనీవినీ ఎరుగని వర్షాలు కురిసి.. బెంగళూరు, చెన్నై వంటి నగరాల్లో జనజీవనం స్తంభించింది. విచక్షణా రహితంగా నిర్మించిన భవనాలు, ఇళ్లు, ఇతర నిర్మాణాల వల్లే నగరాల్లో చిన్నపాటి వర్షానికి కూడా అన్ని ప్రాంతాలు జలమయం అవుతున్నాయి.

తుపానులు, వరదలు, భూకంపాలు వంటి ప్రకృతి వైపరీత్యాలు, విపత్తుల నిర్వహణకు (సహాయ, పునరావాసాల కోసం) ఏటా స్థూల జాతీయోత్పత్తిలో 2 శాతం ఖర్చవుతోందని రక్షణ మంత్రి ప్రణబ్ ముఖర్జీ వెల్లడించారు. ఈ నష్టాన్ని తగ్గించుకునేందుకు కొత్త విపత్తుల నిర్వహణ విధానం రూపొందించారు. ఇది రాగల వైపరీత్యాలను ముందుగానే గుర్తించి, తగు జాగ్రత్తలు తీసుకునేవిధంగా 'హెచ్చరికల వ్యవస్థ'ను ఆధునికీకరించనుంది.

యుద్ధాలే నయం:

యుద్ధాల కంటే ప్రకృతి వైపరీత్యాల వల్లే ప్రజలు ఎక్కువగా నష్టపోతున్నట్లు అంచనా. ప్రకృతి వైపరీత్యాల కారణంగా తమ ఆవాసాలను కోల్పోయి.. ఇతర ప్రాంతాలకు వలస పోతున్నారని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ అండ్ హ్యూమన్ సెక్యూరిటీ జరిపిన ఒక అధ్యయనం వెల్లడించింది. ప్రకృతి కల్లోలాల వల్ల ఏటా లక్షల మంది బాధితులు, తమ నివాస ప్రాంతాలను వదిలి... దేశంలోని ఇతర ప్రాంతాలకు కాని, విదేశాలకు కాని వెళ్లిపోతున్నారు. ఇలా 2015 నాటికి ప్రపంచం 5 కోట్ల మంది పర్యావరణ శరణార్థులను భరించాల్సి ఉంటుందని అంచనా.

సైనిక చర్య వంటిదే:

విపత్తుల నిర్వహణ కూడా సైనిక చర్య వంటిదే. మిలిటరీ ఆపరేషన్‌లో కనిపించే వేగం, కచ్చితత్వం, అధునాతన సంకేతికత, ప్రజల మనోధైర్యం సడలకుండా నిర్వహించే ప్రచార కార్యక్రమం వంటివి ప్రకృతి వైపరీత్యాల సమయంలో కూడా అవసరం. ఒకవిధంగా చెప్పాలంటే... ఆపత్సమయ నిర్వహణకు కూడా సమర సన్నద్ధత అవసరం.

వైపరీత్యాలను తట్టుకోవాలంటే:

అనూహ్యంగా వచ్చి పడే ప్రకృతి వైపరీత్యాలను తట్టుకోవడానికి ప్రభుత్వ యంత్రాంగం అన్ని స్థాయిల్లోనూ సిద్ధంగా ఉండాలి. ఎంతో చురుకుగా పనిచేసే సిబ్బంది, అందుకు తగిన అధునాతన సాంకేతికత కలిగిన హెచ్చరికల వ్యవస్థ ఉండాలి. ఆపత్సమయ నిర్వహణకు శాశ్వత సంస్థలు, యంత్రాంగం పనిచేయాలి. యుద్ధాలు, ఘర్షణలు, చొరబాట్ల వంటి సమయాల్లో... సైన్యం నిర్వహించే సమగ్రమైన ఆపరేషనల్ విధానాలను ప్రకృతి వైపరీత్యాల సమయంలో కూడా అనుసరించాలి. ఎటువంటి ప్రకతి వైపరీత్యాన్నైనా తట్టుకొని రక్షణ చర్యలు నిర్వహించ గల సత్తా ఒక్క సైన్యానికే ఉంటుంది. ఎందుకంటే... ఆపత్సమయాలలో నిబ్బరంగా వ్యవహరించ గలగడం, చురుకుగా నిర్ణయాలు తీసుకుని, వేగంగా స్పందించగల నేర్పు,ఓర్పుల విషయంలో సైన్యం తర్ఫీదు పొంది ఉంటుంది. దాంతోపాటు వారి వద్ద ఇటువంటి సమయాల్లో రక్షణ చర్యలకు తగిన యంత్ర పరికరాలు, వాటిని ఉపయోగించే పద్ధతులు తెలిసిన నిపుణులు ఉంటారు. దేశవ్యాప్తంగా కీలక ప్రాంతాల్లో సైన్యం సిద్ధంగా ఉండటంవల్ల వారు విపత్తులు సంభవించిన వెంటనే కాలయాపన లేకుండా ప్రమాద స్థలానికి చేరడానికి వీలవుతుంది. పరిస్థితి మరీ విషమించి, రక్షణ చర్యలు చేపట్టడం రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగానికి అలవికాని స్థితి ఏర్పడిన సమయాల్లో మాత్రమే సైన్యం సహాయాన్ని కోరాలి.

సహకారం.. సమన్వయం:

విపత్తుల నిర్వహణలో ప్రాథమికంగా మూడు అంశాలు ముఖ్యమైనవి. 1. ఆపదలు రాకుండా ముందుగానే నివారణ చర్యలు. 2. ఆపద సంభవించాక నష్టం అతి తక్కువగా ఉండేటట్టు చర్యలు తీసుకోవడం 3. సత్వర సహాయ, పునరావాస కార్యక్రమాల నిర్వహణ. వీటిని పకడ్బందీగా నిర్వహించేందుకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక పథకాలతో

సన్నద్ధంగా ఉండే ఒక నిర్మాణాత్మక సంస్థ ఉండాలని.. వాటి విధులు, బాధ్యతలను స్పష్టంగా నిర్వచించాలని నిపుణులు అభిలేకుండా ప్రాయపడుతున్నారు. అంతకుమించి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు సమర్థంగా చర్యలు తీసుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య చక్కటి సహకారం, సమన్వయం ఉండాలి.

జాతీయ విపత్తుల నిర్వహణ బిల్లు, 2005:

భారత ద్వీప కల్పంపై 2004, డిసెంబరు 26న... సునామీ విరుచుకుపడి వేలాది మంది ప్రాణాలు, ఆస్తులు హరించింది. ఈ దారుణం అనంతరం భారత పార్లమెంటు... 2005, డిసెంబరు 12న జాతీయ విపత్తుల నిర్వహణ బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించింది. మానవ తప్పిదాల వల్ల, ప్రకృతి వైపరీత్యాల వల్ల తలెత్తే ఆపదలను తట్టుకొని, సహాయ చర్యలు చేపట్టేందుకు... కేంద్ర, రాష్ట్ర, స్థానిక స్థాయిల్లో.. సంస్థలను ఏర్పాటు చేసేందుకు ఈ బిల్లు వీలు కల్పిస్తోంది. ఆపత్సమయ నిర్వహణకు నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ (ఎన్‌డీఎంఏ)ను ఏర్పాటు చేస్తారు. 2005, జూలైలో ప్రధానమంత్రి అధ్యక్ష తన ఏడుగురు సభ్యులతో ఎన్‌డీఎంఏ ఏర్పాటైంది. దీనికి భారత మాజీ సైనిక దళాల ప్రధానాధికారి ఎన్.సి.విజ్ ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. మానవ తప్పిదాల(రసాయన, జీవ రసాయన, అణ్వాయుధాల దాడులు కూడా)వల్ల.. ప్రకృతి వైపరీత్యాల వల్ల తలెత్తే పరిస్థితులను తట్టుకునేందుకు అవసరమైన సంస్థాగత యంత్రాంగాన్ని రూపొందించేందుకు వీలుగా ఈ చర్యలు చేపట్టారు. విపత్తుల నిర్వహణకు అవసరమైన పథకాలను, విధానాలను రూపకల్పన చేసే అధికారం ఎన్‌డీఎంఏకు ఉంటుంది.

కేంద్ర మంత్రిత్వ శాఖలు, వాటి సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వాలు పాటించాల్సిన మార్గదర్శకాలను ఎన్‌డీఎంఏ రూపొందిస్తుంది. ఆపత్సమయ నిర్వహణకు రాష్ట్ర స్థాయిలో ముఖ్యమంత్రి అధ్యక్షతన, జిల్లా స్థాయిలో కలెక్టర్ల ఆధ్వర్యంలోనూ ఏజెన్సీల ఏర్పాటుకు బిల్లు వీలు కల్పిస్తోంది. జిల్లా ఏజెన్సీలకు కలెక్టర్‌తో పాటు జిల్లా పరిషత్ చైర్మన్ కూడా సహాధ్యక్షుడిగా వ్యవహరిస్తారు.

డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్:

వైపరీత్యాల్లో వెంటనే స్పందించి.. సహాయ కార్యక్రమాలను అందించేందుకు పూర్తి శిక్షణ, అధునాతన యంత్రపరికరాలు కలిగిన 'నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్'ను ఏర్పాటు చేస్తారు. ఇందుకోసం కేంద్రం తమ పారా మిలిటరీ దళాల నుంచి 8 బెటాలియన్లను కేటాయించింది. అలాగే రాష్ట్ర ప్రభుత్వాలు కూడా తమ అధీనంలోని సర్వీసుల నుంచి కొన్ని దళాలను అందించాలని బిల్లు నిర్దేశిస్తోంది. విపత్తుల నిర్వహణ పథకాన్ని అమలు చేసేందుకు స్థానిక సంస్థల నుంచి 30 లక్షల మంది ప్రతినిధులు పాల్గొంటారని కేంద్ర హోంమంత్రి శివరాజ్ పాటిల్ చెప్పారు.

విపత్తుల నిర్వహణకు చట్టబద్ధత:

విపత్తుల నిర్వహణకు ఈ బిల్లు చట్టబద్ధత కల్పిస్తోంది. ఇన్నాళ్లు ఆపదలు సంభవించినపుడు చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వ ఆదేశాల కోసం ఎదురు చూసేవారు. ఆదేశాలు అందిన తర్వాతే రంగంలోకి దిగేవారు. ఈ బిల్లు ద్వారా అటువంటి అవసరం లేకుండా... ఆపద సంభవించినపుడు తనంతట తాను రంగంలోకి దిగేందుకు ఏజెన్సీలకు స్వయం నిర్ణయాధికారం ఉంటుంది. ఈ బిల్లు వల్ల ఆపత్సమయాల్లో వెంటనే స్పందించేందుకు వీలుగా రెండు విభాగాలు ఏర్పడ్డాయి. వీటిలో ఒకటి ఆపద సమయంలో ప్రభుత్వ నిధులు మంజూరుకు వేచి చూడకుండా... వెంటనే రక్షణ, సహాయ చర్యల నిమిత్తం నిధులు విడుదల చేస్తుంది. రెండోది దీర్ఘకాలిక ఆపదల నివారణ ప్రాజెక్టుల నిర్వహణకు పని చేస్తుంది. ఈ బిల్లు వల్ల విపత్తుల నిర్వహణలో పాలుపంచుకునే ప్రభుత్వ అధికారులకు చట్టపరమైన రక్షణ ఉంటుంది!!

విపత్తుల నివారణ... మార్గాలు!

విపత్తుల నివారణపై ఆసియా దేశాల మంత్రిత్వ స్థాయి రెండో సదస్సు గతేడాది నవంబరు 7, 8 తేదీల్లో ఢిల్లీలో జరిగింది. ఈ సదస్సులో ప్రధాని మన్మోహన్ సింగ్ ప్రసంగించారు. విపత్తుల నివారణకు అభివృద్ధి చెందుతున్న దేశాలు సమష్టిగా కృషి చేయాలని ఆ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. మానవ తప్పిదాల వల్ల పరిశ్రమల్లో సంభవించే ప్రమాదాలైనా.. ఉగ్రవాదుల దాడుల వల్ల ఎదురయ్యే నష్టాలనైనా... ఎదుర్కోడానికి ఎల్లవేళలా సిద్ధంగా ఉండాలన్నారు. ఈ ప్రాంతానికి ఉగ్రవాదం ముప్పు పొంచి ఉందని... సరిహద్దుల్లో బాంబు పేల్లుళ్లకు పాల్పడే ప్రమాదముందని మన్మోహన్ హెచ్చరించారు. భారత్‌లో ఉగ్రవాదానికి ఊతం ఇస్తోందంటూ ఆయన పాకిస్థాన్‌ను తప్పుపట్టారు. ఆ దేశం ప్రస్తుతం సంక్షోభ పరిస్థితిని ఎదుర్కొంటోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సవాళ్లను తిప్పికొట్టేందుకు ఆసియా దేశాలన్నీ ఒక ఉమ్మడి వ్యూహాన్ని రూపొందించుకోవాలని కోరారు. హెచ్ఐవీ, ఏవియన్ ఇన్‌ఫ్లూయాంజా వంటి వ్యాధుల వ్యాప్తి వల్ల తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. భూకంపాలు, వరదలు, సునామీల కారణంగా ఇటీవల ఆసియా దేశాలు కష్టాలు పడిన సంగతిని మన్మోహన్ గుర్తు చేశారు. ఆసియా దేశాలు ఇలాంటి విపత్తులను ఎదుర్కొనేందుకు... ప్రాంతీయ సహకారాన్ని పెంపొందించు కోవాలని ఆయన అభిప్రాయపడ్డారు. సముద్రంలో సంభవించే సునామీల వంటి ప్రకృతి వైపరీత్యాలను ముందుగా పసిగట్టేందుకు 'సునామీ ఎర్లీ వార్నింగ్ సిస్టమ్'ను రూపొందించుకున్న తరహాలోనే ఈ ప్రాంతంలోని దేశాల మధ్య ప్రాంతీయ సహకారం అవసరమన్నారు.

ఢిల్లీ డిక్లరేషన్:

రెండు రోజుల పాటు జరిగిన సదస్సు ముగింపు సమావేశంలో... 26 అంశాలతో కూడిన కార్యాచరణ విధానాన్ని(ఢిల్లీ డిక్లరేషన్) ఆమోదించి, ప్రకటించారు. విపత్తులు సంభవించకుండా ముందు గానే ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిందిగా ఆసియా దేశాలకు ఈ డిక్లరేషన్ పిలుపునిచ్చింది. డిక్లరేషన్ ముఖ్యాంశాలు.. హైగో ఫ్రేం వర్క్‌ను అనుసరించి ప్రభుత్వాలన్నీ తమ ప్రాంతంలోని వివిధ ఏజెన్సీలతో కలిసి విపత్తుల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. ఆపత్సమయ నిర్వహణకు అత్యంత ప్రాధాన్యతను ఇచ్చి విపత్తులను నివారించేందుకు ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను నిర్మించుకోవాలి. విపత్తు సంభవించగానే నష్టనివారణకు వీలుగా సత్వరమే సహాయ, పునరావాస చర్యలకు సమష్టిగా కృషి చేయాలి. రెండేళ్లకు ఒకసారి జరిగే ద్వైవార్షిక ఆసియా మంత్రిత్వ స్థాయి సదస్సు మొదటి సమావేశం, 2005లో బీజింగ్‌లో జరిగింది. ఈ సదస్సును విపత్తుల నిర్వహణ నివారణ ప్రాంతీయ వేదికగా మార్చి... అందులో ఆయా ప్రభుత్వాలు, ప్రాంతీయ, ఉప ప్రాంతీయ సంస్థలు, ఐరాస ఏజెన్సీలు, ఇంకా వివిధ సామాజిక, శాస్త్ర, సాంకేతిక సంస్థలు, ప్రైవేటు రంగం కూడా పాల్గొనేలా చేయాలని డిక్లరేషన్ పిలుపునిచ్చింది.

ఉమ్మడి చర్యలు:

ఆసియా దేశాలు మంత్రిత్వ స్థాయి సదస్సును రెండేళ్లకోసారి రొటేషన్ పద్ధతిలో నిర్వహిస్తాయి. ఈ సదస్సులో విపత్తుల నివారణకు చేపట్టిన ఉమ్మడి చర్యలను సమీక్షిస్తారు. విపత్తులను తట్టుకునేందుకు ప్రభుత్వాల మధ్య మరింత సహకారం పెంపొందించేందుకు సదస్సు కృషి చేస్తుంది. వచ్చే సదస్సును కౌలాలంపూర్‌లో నిర్వహించాలని నిర్ణయించారు.

విపత్తుల నష్టాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై పరస్పరం అభిప్రాయాలను తెలుసుకునేందుకు 50 దేశాల ప్రతినిధులకు ఈ సదస్సు ద్వారా అవకాశం లభించిందని విశ్లేషకులు అభిప్రాయ పడ్డారు. ఆసియా ప్రాంతంలో విపత్తులను నివారించేందుకు ఆయా దేశాలను ఒకే తాటిపైకి తెచ్చే ఉమ్మడి ప్రణాళికలపై చర్చించేందుకు ఇలాంటి సదస్సు ఉపయోగపడు తుందన్నారు. విపత్తుల వల్ల జరిగే నష్టాన్ని గుర్తించి, వాటి తీవ్రతను తగ్గించడానికి సంయుక్త కృషి అవసరమన్న విషయాన్ని ఆసియా దేశాల సదస్సు గుర్తించడం మంచి పరిణామమని విశ్లేషకులు భావిస్తున్నారు.

ముఖ్యాంశాలు:

- వైపరీత్యాలు చెప్పి రావని, విపత్తులకు ఏ దేశమూ మినహాయింపు కాదని గతేడాది నవంబరులో జరిగిన ఐరాస సర్వ సభ్య సమావేశంలో పాల్గొన్న భారత ప్రతినిధి ప్రభా ఠాగూర్ పేర్కొన్నారు. అందువల్ల విపత్తుల నివారణకు, నిర్వహణకు దేశాలన్నీ ఉమ్మడిగా సహకరించుకోవాలని సూచించారు.
- విపత్తుల వల్ల సంభవించే నష్టాన్ని తగ్గించేందుకు అధునాతన సాంకేతికతను వినియోగించుకోవడం.. ద్వైపాక్షిక, ప్రాంతీయ, అంతర్జాతీయ సహకారం సాధించుకోవడం...
  అలాగే ప్రకృతి వైపరీత్యాలకు తరచు నష్టపోయే ప్రాంతాలలో బీమా సౌకర్యాలను విస్తరించి, ఆదుకోవాలని భారత దేశం సూచించింది.
- అత్యవసర మందుల సరఫరా, గాలింపు, తక్షణ సహాయ చర్యలు; రిమోట్ సెన్సింగ్, వేగంగా సమాచారం అందించే వ్యవస్థ.. వీటన్నిటినీ సమన్వయం చేసే నిపుణులతో ఆపత్సమయ నిర్వహణ ఒక శాస్త్రంగా మారిందని ఎన్‌డీఎంఏ సభ్యుడు వినోద్ చంద్ర మీనన్ అన్నారు. సునామీలను ముందుగానే గుర్తించి, హెచ్చరించే వ్యవస్థను గతేడాది నవంబరు నుంచి ప్రవేశపెట్టడం ద్వారా... విపత్తుల రక్షణ వ్యవస్థను బలోపేతం చేసినట్లు అయిందని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.
- ఆపత్సమయంలో ఆదుకునేందుకు, విలువైన సమయం నష్టపో

కుండా వెంటనే రంగంలో దిగేందుకు కేంద్ర హోం శాఖ కొత్త 'ఇంటిగ్రేటెడ్ ఆపరేషన్స్ సెంటర్'ను ప్రారంభించింది. ఇందులో అధునాతన ఉపగ్రహ సమాచార వ్యవస్థ, డిజిటల్ మ్యాపులు, ల్యాప్‌టాప్‌లతో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాలు, జిల్లాలలోని కంట్రోల్ రూమ్‌ను అనుసంధానిస్తూ.... ల్యాన్ నెట్‌వర్క్, వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించుకోగల సౌకర్యాలను అమర్చారు.

- ప్రభుత్వ ప్రతిపాదిత విపత్తుల నిర్వహణ విధానం... విపత్తుల నష్టాల నివారణ, సహాయ చర్యల కోసమే కాక.. వైపరీత్యాలను కూడా అభివృద్ధికి అనుకూలంగా మార్చుకునే సరికొత్త ఓరియంటేషన్ అని కేంద్ర రక్షణ మంత్రి ప్రణబ్ ముఖర్జీ ప్రకటించారు. విపత్తులు ఏ మారుమూల సంభవించినా.. వెంటనే స్పందించి కార్య రంగంలోకి దూకేందుకు వీలుగా జిల్లా యంత్రాంగం, పంచాయతీరాజ్, కార్పొరేషన్లు, మున్సిపాలిటీలను పటిష్ట పరచేందుకు విపత్తు నిర్వహణ విధానాన్ని రూపొందిస్తున్నట్టు ఆయన తెలిపారు.